

నిధుల దుబారా!

● ట్రిపుల్‌ఐటీలో ఇష్టారాజ్యంగా నిధుల వినియోగం ● ప్రాధాన్యత లేని వాటికి ఖర్చులు ● నిధుల కొరత నేపథ్యంలో అధికారుల వింత వైఖరి



యూనివర్సిటీలో ప్రముఖులు, అతిథుల కోసం ఉన్న అతిథిగృహం... ఇది కాదని కొత్తది ఏర్పాటు చేశారు

బాసర, ఏప్రిల్, 29 : ఏదైనా పనిచేపడితే తక్కువ ఖర్చు ఎక్కువ ప్రయోజనం పరిగణలోకి తీసుకుంటాము. కానీ బాసర ట్రిపుల్ ఐటీలో పరిస్థితి వేరుగా ఉంది. ఇక్కడి అధికారుల్లో ఆర్థిక క్రమశిక్షణ కొరవడింది. నిధులను అత్యవసరం, అవసరం, సౌకర్యం, విలాసం కాకుండా అవసరం లేని వాటికి అడ్డగోలుగా ఖర్చులు పెట్టేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం నుంచి వస్తున్న అరకొర నిధులు సద్వినియోగం కాక కొత్తసమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మరోపక్క విద్యార్థుల అత్యవసరాలు తీరక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా గత రెండేళ్ల నుంచి యూనివర్సిటీ ఆర్థిక కష్టాలతో కొట్టుమిట్టాడుతుంది. ప్రాధాన్యత లేని వాటికి వచ్చిన నిధులు వెచ్చించడంతో అవసరమున్న పనులు పెండింగ్‌లో ఉంచాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. విద్యాసంవత్సరం ముగియడానికి వచ్చినా విద్యార్థులకు యూనిఫామ్స్, హాస్టళ్లలో సామాగ్రి, స్పోర్ట్స్ యూనిఫామ్ అందించలేదు. కంప్యూటర్ ల్యాబ్ లేకుండానే పీయూసీ-1, పీయూసీ-2 విద్యార్థులు చదువు కొనసాగించడం మరో ఉదాహరణగా చెప్పవచ్చు. ఇలా చెప్పుకుంటూ పోతే విద్యార్థుల అత్యవసరాలు సమకూరడం లేదు. నిధుల వినియోగం విషయంలో యూనివర్సిటీ అధికారుల తీరుపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2022 సంవత్సరంలో విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం బాసర ట్రిపుల్ ఐటీపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అప్పటి ప్రభుత్వ పెద్దలు అనేక సార్లు ట్రిపుల్ ఐటీకి వచ్చి విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశారు. ఈ క్రమంలో రూ. కోట్ల నిధులను ట్రిపుల్ ఐటీకి కేటాయించారు. వచ్చిన నిధులను సక్రమంగా ప్రణాళిక బద్ధంగా వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కాని జరిగిన పనులను పరిశీలిస్తే రూ.కోట్ల నిధులు దుబారా జరిగినట్లు తెలుస్తోంది.

ఈసీ కమిటీలు లేకుండానే ఖర్చులు

యూనివర్సిటీ పరిపాలనకు సంబంధించి ఈసీ (ఎగ్జిక్యూటివ్ కమిటీ) పాత్ర కీలకమైనది. ప్రతీది ఈ కమిటీలో చర్చించి తీర్మానం జరిగాకే పనులు చేపట్టాల్సి ఉంటుంది. ప్రత్యేకరాష్ట్రం ఏర్పడిన సమయంలో ముగ్గురు లేదా నలుగురు- ఐదుగురు సభ్యులతో ఈసీ కమిటీ ఉండేది కమిటీలో సభ్యులు ఒక్కొక్కరు రిటైర్మెంట్ అవుతూ ప్రస్తుతం ఒక్కరు మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. వైస్ ఛాన్సలర్ కూడా ఒక మెంబర్‌గా ఉంటారు. పూర్తిస్థాయి సభ్యులతో కమిటీ ఉండాలి కాని యూనివర్సిటీకి ఛాన్సలర్ లేకపోవడంతో ఆ ప్రక్రియ కొనసాగలేదు. ఈ కారణంగా ఈసీ కమిటీ పూర్తిస్థాయిలో లేకపోవడం, యూనివర్సిటీ నిధుల దుబారాకు ప్రధాన కారణంగా మారింది. అభ్యంతరం చెప్పేవారు లేకపోవడంతో నిధుల వినియోగం అడ్డగోలుగా జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు యూనివర్సిటీ అధికారులకు రూ. 5 లక్షల లోపు ఖర్చు చేసే అధికారం ఉంది. చిన్న చిన్న ఖర్చుల విషయంలో భారీగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రెగ్యులర్ వీసీ లేకపోవడం కూడా ప్రాధాన్యత ఖర్చులు తెలవడం లేదనే వాదనలు ఉన్నాయి. అధిక వ్యయం విషయాల్లో యూనివర్సిటీలో అంతర్గత కమిటీలు వేసి ప్రాధాన్యతల వారిగా ఖర్చులు పెడితే విమర్శలకు అవకాశం ఉండేది కాదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మచ్చుక కొన్ని ఖర్చుల వివరాలు

● యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద సుమారు రూ. 10 కోటలతో భవనం, అందులో ఇతర సామాగ్రితో కొత్తమెస్‌ను ఏర్పాటు చేశారు. ఇది రెండేళ్ల క్రిందటే జరిగింది. ఇదే మెస్‌లో ఎలక్ట్రికల్ కిచెన్‌ను ఏర్పాటు చేస్తామని సుమారు రూ. కోటి నిదులు ఖర్చు చేశారు. ఏడాది అవుతున్నా ఇప్పటికి భవనం వినియోగంలోకి రాలేదు.

● యూనివర్సిటీలో ప్రముఖులు, అతిథులు వచ్చినప్పుడు బస చేసేందుకు గెస్టహౌజ్ ఉంది. అందులోని గదులు, డైనింగ్‌హాల్, మీటింగ్ హాల్ వంటి వసతి సౌకర్యాలు ఉన్నాయి. ఇది కాదని యూనివర్సిటీ లో సిబ్బంది క్వార్టర్స్ పక్కన గల మరో భవనాన్ని వీఐపీ గెస్ట్‌హౌజ్ పేరిట రూ. లక్షలు పెట్టి ఆధునీకరించారు. ఒక గెస్ట్‌హౌజ్ ఉండగా మరో గెస్ట్‌హౌజ్‌ను ఎందుకు సిద్ధం చేశారో అధికారులకే తెలియాలి.

● యూనివర్సిటీలో కొందరు అధికారులు తమ వ్యక్తిగత అవసరాలకు విలాసవంతమైన పర్నిచర్, పెద్ద టీవీలు, ఫైఫోన్‌లు యూనివర్సిటీ నిధులతో కొనుగోలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

● యూనివర్సిటీ ప్రధాన ద్వారంకు రూ. లక్షలు వెచ్చించి రంగులు వేశారు. నిధుల కొరత వేధిస్తున్న సమయంలో ఇది అవసరమా అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● యూనివర్సిటీలో పీయూసీ-, పీయూసీ-2 విద్యార్థుల కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు కోసం యూనివర్సిటీలో అనేక గదులు, భవనాలు ఖాళీగా ఉన్నాయి. వీటిని వినియోగించుకోకుండా దాదాపు రూ. 1.5 కోట్లతో ప్లేస్‌మెంట్ భవనంపై పై అంతస్థులో గదులను నిర్మిస్తున్నారు.

● ప్రధానద్వారం వద్ద సుమారు రూ. 25 లక్షలతో రేకుల షెడ్డును నిర్మించారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులు కలుసుకునేందుకు ఇవి ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అయితే మూడేళ్ల క్రిందట అప్పటి వైస్‌ఛాన్సలర్ అశోక్ విద్యార్థులను వారి తల్లిదండ్రులు కలుసుకునేందుకు రెండు పేరెంట్స్ లాంజ్‌లను ఏర్పాటు చేశారు. గర్ల్స్ హాస్టల్ భవనం కింద సెల్లార్‌లో బాలికల కోసం బాయ్స్ హాస్టల్ సెల్లార్‌లో బాలుర కోసం పర్నిచర్‌తో రెండు లాంజ్‌లను అప్పటి అధికారులు ఏర్పాటు చేశారు. ఈ లాంజ్‌లు ఏమైనట్లో తెలియదు కాని మళ్లీ కొత్తగా షెడ్డును ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రూ.లక్షలు వెచ్చించి యూనివర్సిటీ ప్రవేశద్వారానికి వేసిన రంగులు

అవసరాలకే నిధులను వినియోగిస్తున్నాం

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వినతులు వచ్చినందునే ప్రధాన గేటు వద్ద షెడ్డు నిర్మిస్తున్నాం. అవసరాల కోసమే కొత్త కారును కొనాల్సి వచ్చింది. వీఐపీ గెస్ట్‌హౌజ్ కాని, కంప్యూటర్ ల్యాబ్ కోసం భవనం కాని ఏదైనా యూనివర్సిటీ, విద్యార్థులకు అవసరమైతేనే నిధులను వినియోగిస్తున్నాం. ఎక్కడా నిధుల దుర్వినియోగం జరగలేదు.

(వెంకటరమణ, వైస్ ఛాన్సలర్)



ఈ ఫోటోలో ఉన్న షెడ్డు యూనివర్సిటీ రెండవ గేటు దగ్గర రూ. లక్షలు వెచ్చించి అధికారులు ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ వాహనాల పార్కింగ్ కోసమని చెబుతున్నారు. కాని ఇప్పటి వరకు ఆ షెడ్డు కింద వాహనాలను ఉంచడం లేదు.

తనిఖీ కేంద్రాలను సందర్శించిన పరిశీలకులు



గంజాల్ కేంద్రం తనిఖీ చేస్తున్న పరిశీలకులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చించోలి(బి), కొండాపూర్, గంజాల్ వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాలను వ్యయ పరిశీలకుడు జాడవారు వివేకానంద్ సోమవారం సందర్శించారు. వాహనాలు అన్నింటినీ తనిఖీ చేయాలని, వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశించారు. 50 వేల కంటే ఎక్కువ మించి నగదు అనుమతి పత్రాలు లేకుంటే సీజ్ చేయాలన్నారు. ప్రజలకు సందేహాలు, ఫిర్యాదులు తన మొబైల్ 8143876383 నంబర్‌కు తెలియజేయాలన్నారు.

నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్తగా రాంకిషన్‌రెడ్డి



నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 29 : నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్తగా ఆ పార్టీ నాయకుడు మాజీ డీసీసీబీ చైర్మన్ కే.రాంకిషన్‌రెడ్డి నియమితులయ్యారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆయనను నియమించారు. ఈ సందర్భంగా రాంకిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

'కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది'



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి, నాయకులు

సారంగాపూర్, ఏప్రిల్ 29 : జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు, నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు చించోలి(బి), అడెల్లి గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, రాజమహ్మద్, దశరథ్ రాజేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి నాయకులు ఉన్నారు.

కుభీర్‌లో..

కుభీర్, ఏప్రిల్ 29 : చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని సోమవారం కుభీర్ మండలంలోని ధార్‌కుభీర్‌లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారెంటీలను కుభీర్‌లో గడగడపకు వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌవాన్ శంకర్, తూం రాజేశ్వర్, రాథోడ్ జయరాం, కందూర్ సంతోష్, మైనార్టీ నాయకులు జావిద్‌ఖాన్, వెన్నెల సతీష్, చౌహన్ రోహిదాస్, ఇమ్రాన్, ఆనంద్, తదితరులున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు

● బైంసా టౌన్ సీఐ రాజారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న బైంసా టౌన్ సీఐ రాజారెడ్డి

బైంసా, ఏప్రిల్ 29 : పట్టణ పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని బైంసా టౌన్‌స సీఐ రాజారెడ్డి వెల్లడించారు. సోమవారం వీడియో ప్రకటన ద్వారా సంబంధిత వివరాలు తెలిపారు. ఇక నుంచి మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే సంబంధిత వాహన యజమానితో పాటు తల్లితండ్రులపై కేసులు నమోదు చేస్తామని వివరించారు. ప్రతి రోజు వాహనాల తనిఖీ కోసం స్పెషల్ డ్రైవ్ ప్రారంభించామని పెర్కొన్నారు. ఎక్కడ కూడా మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడిన సంబంధిత వాహనం సీజ్ చేయడమే కాకుండా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. త్రిబుల్ రైడింగ్ చేసే వారిపై సైతం కేసులు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. తల్లితండ్రులు తమ పిల్లలు నడుపడానికి వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.

హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నిర్వహణ సమయంలో మార్పు

పట్టణ పరిధిలోని గాంధీగంజ్ ప్రాంతంలో రోజు జరిగే హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్ నిర్వహణ సమయాన్ని మార్చినట్లుగా టౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. ఇది వరకు ప్రతి రోజు అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమయ్యే మార్కెట్ ఇక నుంచి ఉదయం 4 గంటలకు ప్రారంభమవుతుందని వివరించారు. అమ్మకందారులు,కొనుగోలుదారులు క్రయ,విక్రయాల కోసం గాను గాంధీగంజ్‌కు ఉదయం 4 ప్రాంతానికే చేరుకోవాలన్నారు. ఇదే క్రమంలో ఇది వరకు గాంధీగంజ్ ప్రధాన రోడ్డు మార్గంలో ఒకవైపు మొత్తాన్ని మూసివేసి క్రయ, విక్రయాలు నిర్వహిస్తుండటం మూలంగా ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు ఏర్పడుతున్నాయని వివరించారు. సంబంధిత సమస్యల పరిష్కారం కోసం గాను ఇక నుంచి క్రయ, విక్రయాలను ప్రధానరోడ్డు మీద కాకుండా గాంధీగంజ్ లోపలి వైపు నిర్వహించుకోవాలన్నారు. అంతేకాకుండా హోల్‌సేల్ స్థలి వద్ద కొనసాగే టీస్టాల్, టిఫిన్ సెంటర్లు కూడా అర్ధరాత్రి 12 గంటల నుంచి కాకుండా ఉదయం 4 గంటల నుంచే నిర్వహించుకోవాలన్నారు. సంబంధిత విషయంలో ఎవరు అతిక్రమించిన చట్టపరమైన చర్యలు తప్పవని వెల్లడించారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి



ఉమ్రి(కే)లో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తానూర్, ఏప్రిల్ 29 : మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో 133వ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగా నిర్మాత బీఆర్‌అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. అనంతరం భారతీయ బౌద్ధ మహాసభ నాయకులు గంగాధర్ వాగ్మారే మాట్లాడుతూ అంబేడ్కర్ దళితులకు మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులను కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మరోతి, మాజీ ఉపసర్పంచ్ దేవ్‌కే సాయినాథ్, యూత్ నాయకులు సూర్యకాంత్, కిర్తికుమార్, గౌతం, సందీప్, మాధవ్, గోవింద్, విశాల్ తదితరులున్నారు.

మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్

● ఎమ్మార్పీఎస్ అనుబంధ సంస్థల సమావేశంలో మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా కాంగ్రెస్ పార్టీ మాదిగలకు కేటాయించకపోవడం మోసం చేడయమేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఆదివారం రాత్రి నిర్మల్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆదిలాబాద్ పార్లమెంట్ సదస్సుకు ఆయన హాజరై మాటా్లడారు. మాదిగల పట్ల కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. మాదిగలను ఆ పార్టీ అన్యాయం చేసిందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో మాదిగలకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని ఈ రెండు పార్టీల వైఖరి ఒక్కటేనన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని నాయ కత్వా న్ని అణచివేసే కుట్ర కాంగ్రెస్ చేసిందని ధ్వజమెత్తారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు. నో కాంగ్రెస్, నో బీఆర్ఎస్ ఓన్లీ బీజేపీ అని నినాదం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవ్‌మాదిగ, నందకుమార్, బాలేరావు, శనిగారపురవి, మురళీకృష్ణ, శ్రీనివాస్, మల్లేష్, బ్రహ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయం'

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 29 : వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ సంయుక్త కన్వీనర్ ఎంబడి రాజేశ్వర్ అన్నారు. సోమవారం ఆయన నిర్మల్ పట్టణంలోని బోయివాడలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ భారీ మెజార్టీతో గెలుస్తారని, ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. కేంద్రంలోని పది సంవత్సరాల బీజేపీ పాలనలో ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా నిర్మించలేదని ఇటు రాష్ట్రంలో పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రజల సొమ్మును పందుకొక్కుల తిన్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఆదిలాబాద్ ఎంపీగా ఆత్రం సుగణను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజ లకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బి. గోవింద్, సేవాదళ్ అధ్యక్షుడు కే. రాజేశ్వర్, కిసాన్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యకాంత్ కాంబ్లీ, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాకేష్, పట్టణ కాంగ్రెస్ నాయకులు డి. రవి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుబాయ్‌లో మచ్కల్ వాసి గుండెపోటుతో మృతి

ముథోల్, ఏప్రిల్ 29 : మండలంలోని మచ్కల్ గ్రామానికి చెందిన మల్లెపూల సాయన్న(37) అనే యువకుడు దుబాయ్‌లో గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. ఆయనకు తానూర్ మండలంలోని మహాలింగి గ్రామానికి చెందిన జ్యోతితో 2007 డిసెంబరు 14న వివాహం జరిగింది. మృతుడికి ఇద్దరు కుమారులు. మృతుడు పొట్టకూటికోసం 9 సంవత్సరాలు దుబాయ్‌కి వెళ్లాడు. ఈ నెలలో 25వ తేదీన ఇండియాకు వచ్చి ఇళ్లు కట్టుకోవాలని అనుకున్నాడు. అకస్మాత్తుగా ఈ నెల 18న గుండెపోటుతో దుబాయ్‌లో మృతి చెందాడు. సోమవారం తన స్వగ్రామమైన మచ్కల్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో అందరితో ఆత్మీయంగా ఉండేవాడని, మృతుడి భార్య, పిల్లల రోదనలు కంట తడి పెట్టించాయి.



సాయన్న మృతదేహం

నీటి గుంతలో పడి ఒకరి మృతి



సంఘటన స్థలంలో ముత్తన్న మృతదేహం

బైంసా రూరల్, ఏప్రిల్ 29 : మండలంలోని వట్టోలి గ్రామంలో మచ్చర్ల ముత్తన్న నీటిగుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వట్టోలి గ్రామానికి చెందిన మచ్చర్ల ముత్తన్న డ్రైవర్ పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. ఆదివారం పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీ కులు ఎంత వెతికిన ఆచూకీ లభించలేదు. సోమవారం గ్రామ సమీపంలో నీటి గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. అన్న మచ్చర్ల గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఇంటర్ ఫీజు చెల్లింపుకు గడువు మే 2

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 29 : ఇంటర్మీడియట్ 2024 మార్చ్‌లో పరీక్షరాసి ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లమెంటరీ పరీక్ష ఫీజ్ మే 2 లోగా చెల్లించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరుశరాం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు మే 2024 నుంచి జరిగే పరీక్షకు హాజరుకావచ్చునని తెలిపారు. ఇంప్రూవ్ మెంట్ రాసే వారు కూడా తమ ఫీజను చదివిన కళాశాలలో చెల్లించవచ్చునన్నారు.

జాబ్‌మేళాలో 15 మంది ఎంపిక

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 29 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన మెగాజాబ్ మేళాలో 15 మంది ఎంపికయ్యారు. జియో ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలు జాబ్ మేళా నిర్వహించింది. ఈ సందర్భంగా టాస్క్ సీఈవోకు ప్రిన్సిపాల్ భీమ్‌రావు అభినందనలు తెలిపారు. సమన్వయకర్త డాక్టర్ శంకర్, రవి కుమార్, పీజీ రెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

7న జడ్పీ సర్వసభ్య సమావేశం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 29 : జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మే 7న ఉదయం 10:30 గంటలకు జడ్పీ మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తున్నారు. సీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. అభివృద్ధి పనులపై సమీక్ష జరుపనున్నట్లు పేర్కొన్నారు.

అవార్డులకు దరఖాస్తు చేయండి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 29 : బహుజన సాహిత్య అకాడమీ జిల్లా కమిటీపూలే, అంబేద్కర్ సేవారత్న అవార్డుల కోసం ఆసక్తి గలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఏపీజే కలాం, సేవా, సాహిత్య, నాట్య, విద్యారత్న, మహిళా నాయకత్వ అవార్డులు అందజేయనున్నట్లు రాష్ట్ర ఎంపిక కమిటీ సభ్యుడు నిగులపు లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 11న తిరుపతిలో జరిగే బహుజన రైట్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్సులో ఈ అవార్డులు అంద జేస్తారన్నారు. వివరాలకు 9963497446 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

కరాటే శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణలో పాల్గొన్న బాలికలు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 29 : నిర్మల్‌లోని వివేక్ హైస్కూల్‌లో సోమవారం ఝాన్సీ లక్ష్మీబాయి ఉచిత వేసవి కరాటే శిబిరాన్ని డాక్టర్ రజని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వేసవి సెలవులు సద్వినియోగానికి ఇలాంటి శిబిరాలు అవసరమన్నారు. జేకేఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేజేందర్ సింగ్ భాటియా, అనురాధ, గంగ్రత్ రమేష్, శిక్షకురాలు మృణాళిని, మంచిర్యాల నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

ఆదిలాబాద్అర్బన్, ఏప్రిల్ 29 : విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదిలాబాద్‌లో సోమవారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన పవన్ కళ్యాణ్ జేఎల్ఎంగా నెలన్నర క్రితమే విధుల్లో చేరాడు. సోమవారం పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మరమ్మతులు చేయడానికి వెళ్లాడు. స్తంభం ఎక్కి మరమ్మతులు చేసేటప్పుడు ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో పవన్‌కళ్యాణ్‌కి షాక్ కొట్టడంతో స్తంభంపై నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

ఎంపీ అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 29: ఆదిలాబాద్ లోక్‌సభ ఎన్నికలబరిలో నిలిచిన అభ్యర్థులకు జిల్లా రిటర్నింగ్ అధికారి రాజార్షిషా గుర్తులను కేటాయించారు. మొత్తం 23మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా 12మంది మాత్రమే ఎన్నికల బరిలో నిలిచారు.ప్రధాన పార్టీలతో పాటు ఇతర గుర్తింపు పొందిన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు ఇలా ఉన్నాయి.. ఆత్రంసక్కు (బీఆర్ఎస్)కు కారు గుర్తు, ఆత్రం సుగుణ (కాంగ్రెస్ పార్టీ)కు హస్తం, గోడం నగేష్ (బీజేపీ)కు కమలం, మేస్రం జంగుబాపు (బహుజన్ సమాజ్ పార్టీ)కు ఏనుగు, కొడప వామన్‌రావు(గోండ్వానా దండకారణ్య పార్టీ)కు తురా ఊదుతున్నమనిషి, గంగాదేవి మేస్రం (ధర్మసమాజ్ పార్టీ)కు చెప్పులు, గేడం సాగర్ (ఇండియా ప్రజాబంధు పార్టీ)కు బాకా, చావాన్ సుదర్శన్ (అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ)కు రోడ్‌రోలర్, ఎన్.తిరుపతి (విద్యార్థుల రాజకీయ పార్టీ)కు బ్యాట్, మాలోతు శ్యామ్ (అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్)కు చపాతి రోలర్, బుక్య జైవంత్‌రావు (స్వతంత్ర)కు ప్రెషర్ కుక్కర్, రాథోడ్ సుభాష్ (స్వతంత్ర)కు గ్యాస్‌సిలిండర్ గుర్తులను కేటాయించినట్లు పేర్కొన్నారు.

మున్నూరుకాపు యూత్ అధ్యక్షుడిగా రమేష్

బోథ్, ఏప్రిల్ 29: మండల మున్నూరు కాపు యువజన సంఘం అధ్యక్షుడిగా మర్లపల్లి గ్రామానికి చెందిన పాలంపుర రమేష్ పటేల్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు కట్టబెట్టిన రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మున్నూరు కాపు విద్యార్థుల కోసం భవిష్యత్తులో కృషి చేస్తానన్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో మండుతున్న ఎండలు!

● నేరడిగొండలో 42.9 డిగ్రీల అత్యధిక పగటి ఉష్ణోగ్రత నమోదు ● బోథ్‌లో గుక్కెడు నీటి కోసం పశువుల తహతహ


జిల్లాకేంద్రంలో నిర్మానుష్యంగా మారిన కొమురంభీం చౌక్


బోథ్‌లోని పెద్దవాగు సమీపంలో పశువుల కోసం తవ్విన బావి

ఆదిలాబాద్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో మండిపోతున్న ఎండలతో జనం ఉక్కిరవుతున్నారు. గత కొద్ది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. దీంతో జిల్లావ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 41.3 డిగ్రీలు కాగా కనిష్టంగా 28.3 డిగ్రీలు నమోదయ్యాయి. అత్యధికంగా నేరడిగొండ మండలం 42.9, బోథ్‌లో 42.0, జైనథ్‌లో 41.8, ఇంద్రవెల్లిలో 41.0, గుడిహత్నూర్‌లో 40.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా తాంసి ,బజార్‌హత్నూర్, తలమడుగు, బీంపూర్ మండలాల్లో 40.0 డిగ్రీల లోపు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగలంతా తీవ్రమైన వడగాలులు, ఉక్కపోత కనిపిస్తున్న సాయంత్రం వేళల్లో ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు కురుస్తున్నాయి. కరెంట్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కరెంట్ సరఫరా నిలిచి పోతే ఇండ్లలో ఉండే పరిస్థితి కనిపించడం లేదు. తీవ్రమైన ఉక్కపోతను భరించ లేక రాత్రివేళల్లో ఆరుబయట, ఇళ్ల దాబాల పైననే జనం కూనుకు తీస్తున్నారు. జిల్లాలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో విషజ్వరాల బారీన పడి జనం మంచం పడుతున్నారు. తీవ్రమైన పశుగ్రాసం, నీటిఎద్దడితో మూగజీవాలు అల్లాడుతున్నాయి. మిట్ట మధ్యాహ్నం ఎండతాపం నుంచి తట్టుకోలేక పశువులు చెట్ల నీడను ఆశ్రయిస్తున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే మే మాసంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం బెంబెలెత్తి పోతున్నారు.

● పశువుల దాహం తీర్చేందుకు భగీరథ ప్రయత్నం

బోథ్: మండలంలో రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో గుక్కెడు తాగునీటి కోసం పశువులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో రైతులు జల వనరుల కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. దీనిలోభాగంగా స్థానిక పెద్దవాగు సమీపంలో ఉన్న నీటి కుంటలలో జేసీబీల ద్వారా గుంతలను పెద్దగా తవ్వి పశువులకు దాహార్తి తీర్చే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో పశువులకు కొంత మేరకు దాహార్తి తీరినట్లు అవుతుంది. పక్కనే ఉన్న వాగు ఎండిపోవడంతో పశువులకు దాహం తీర్చాల్సిన ఉద్దేశంతో రైతులు తవ్వించిన గుంతలు మూగజీవాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.



ఓటింగ్ అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ


ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



అవగాహన కార్యక్రమం చేపడుతున్న డీఆర్డీఏ


ర్యాలీలో పాల్గొన్న మహిళలు

ఓటర్లలో చైతన్యం.. విస్తృత ప్రచారం!

ఎన్నికల్లో పోలింగ్ శాతం.. పెంచడమే లక్ష్యంగా ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా పల్లె, పట్టణాల్లో స్వయం సహాయక సంఘాలు,వివిధ శాఖల సిబ్బంద ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమం చేపడుతు న్నారు. ఓటు వినియోగం ప్రాధాన్యం తెలుపుతూ విస్తృత ప్రచారం చేపడుతున్నారు. మరోపక్క పట్టణాలు, మండల కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ప్రదర్శించి ఓటర్లలో చైతన్యం నింపుతున్నారు. ఓటు నమోదు చేసుకోవడమే కాకుండా ఎన్నికల్లో తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరుతున్నారు.

(- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)


మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటాం : మంత్రి సీతక్క

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 29: ఆధునిక పోకడలతో చేతి వృత్తులు నానాటికి కనుమరుగవుతున్నాయని, వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిని ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి సీతక్క అన్నారు. పట్టణంలోని బాలాజి గార్డెన్‌లో విశ్వకర్మ (వడ్రంగి)మరాఠి సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం, వధూవరుల పరిచయ వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి ఆత్రంసగుణతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మరాఠి సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించి మాట్లాడారు. పూర్వీకులు అందించిన ఆచార, వ్యవహారాలు, విశ్వాసాలు, నమ్మకాలను పాటించడం మన ధర్మమని, వాటిని కాపాడుకోవడం మన బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరికి తమ తమ దైవాల పట్ల నమ్మకం ఉంటుందన్నారు. అందరు భేషజాలకు వెళ్లకుండా కలిసిమెలిసి జీవనం సాగించాలని, అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రస్తుత తరుణంలో కులవృత్తులు, చేతివృత్తులు దెబ్బతిన్నాయని వాటిపై ఆధారపడి జీవించే వారికి ప్రోత్సాహకాలు అందించి ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఏ సమస్యలున్న వాటి పరిష్కారానికి జిల్లా ఇన్‌చార్జీ మంత్రిగా కృషి చే స్తానని స్పష్టం చేశారు. ఇందులో అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, విశ్వకర్మ (వడ్రంగి) మరాఠి సంఘం అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి దిలీప్, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మా సంతోష్‌రావు, లోకప్రవీణ్‌రెడ్డి, డి.శ్రీలేఖ, తదితరులున్నారు.

రిజర్వేషన్ల రద్దు పెద్ద అబద్ధం

● బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పతంగి

తలమడుగు, ఏప్రిల్29: మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ రద్దు చేస్తారని వస్తున్న ప్రచారం పెద్ద అబద్ధమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం అన్నారు. సోమవారం మండలంలోని దేవాపూర్ కుచ్లాపూర్, సుంకిడీతో పాటు తదితర గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం మాట్లాడుతూ కేంద్రంలో ముచ్చటగా మూడోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి రానుంది అన్నారు. దీన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వ ప్రచారం చేస్తున్నారన్నారు. ఇందులో పార్లమెంట్ కోకన్వీనర్ మయూర్‌చంద్రకాంత్ కనపర్తి చంద్రకాంత్, జడ్పీటీసీ రాజు మండల అధ్యక్షుడు స్వామి, ఎక్స్ జడ్పీటీసీ జక్కుల ప్రభాకర్, మహేందర్ యాదవ్, బోర్ల వెంకటస్వామి, నాగార్జున్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శశికాంత్ యాదవ్, ధనుంజయ్, కిరణ్, దాంజిపటేల్, భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

'కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి'

తలమడుగు, ఏప్రిల్ 9: జాతీయ గ్రామీణ ఉపాధి పనులకు వస్తున్న కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీవో శేఖర్ కోరారు. సోమవారం మండలంలోని కజ్జర్ల దేవాపూర్ బరంపూర్, తదితర గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రోజురోజుకు గంటలు ఎక్కువ అవుతున్నందున కూలీలు ఉపాధి హామీ పనులను ఉదయం పూటనే చేపట్టాలని సూచించారు. అంతేకాకుండా పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు టాబ్లెట్ సౌకర్యం నీడ సౌకర్యం ఇతర మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కాదా రుయ్యాడి గ్రామంలో అధికారులు వస్తున్నారని ఈ రోజే చల్లటి నీళ్లు, ఇతర మౌళిక వసతులు ఏర్పాటు చేశారని, కూలీలు అధికార దృష్టికి తెచ్చారు. ఇందులో పంచాయతీ సెక్రటరీ అభయ్‌కుమార్, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


రుయ్యాడి ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.3। కనిష్ఠం 28.3



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

మంగళవారం 30 ఏప్రిల్ 2024

జిల్లాల వారీగా ఓటర్ల వివరాలిలా..

జిల్లా పేరు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆదిలాబాద్	2,22,306	2,34,135	09	4,56,450
నిర్మల్	3,55,259	3,82,107	50	7,37,416
ఆసిఫాబాద్	2,27,310	2,28,971	28	4,56,309
మొత్తం	8,04,875	8,45,213	87	16,50,175



ఎంపీ అభ్యర్థుల.. లెక్క తేలింది!

- జిల్లాలో లోక్‌సభ ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు
- మొత్తం 23 మంది అభ్యర్థులలో.. 10 మంది నామినేషన్ల తిరస్కరణ
- నామినేషన్ ఉప సంహరించుకున్న స్వతంత్ర అభ్యర్థి రాథోడ్‌రాజు
- ప్రధాన పార్టీలకు తప్పిన రెబల్స్ గుబులు
- సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు మద్దతుపై అనుమానాలు
- ప్రచారంతో మరింత స్పీడును పెంచిన ఆయా పార్టీల అభ్యర్థులు
- ఎన్నికల్లో గెలిచేందుకు వ్యూహాలకు పదునుపెడుతున్న పార్టీలు
- మే 13న పోలింగ్‌కు ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 16లక్షల 50వేల 175 మంది ఓటర్లు

ఆదిలాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 2024 లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలింది. ఆదిలాబాద్ లోక్‌సభ పార్లమెంట్ నియోజకవర్గానికి మొత్తం 23 మంది అభ్యర్థులు, 42 నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలనలో 13 మంది అభ్యర్థుల నామినేషన్లకు మాత్రమే అధికారులు ఆమోదం తెలిపారు. మిగితా 10 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా లేకపోవడంతో తిరస్కరించారు. దీంతో 13 మంది అభ్యర్థులు ఉండగా.. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియడంతో సోమవారం స్వతంత్ర అభ్యర్థి రాథోడ్‌రాజు తన నామినేషన్ని ఉపసంహరించుకున్నారు. లోక్‌సభ ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు నిలిచినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. 2019 లోక్‌సభ ఎన్నికల బరిలో 16 మంది అభ్యర్థులు పోటీలో నిలవగా.. ఈసారి అభ్యర్థుల సంఖ్య తగ్గి 12కు చేరింది. ఇందులో వివిధ పార్టీల అభ్యర్థులతో పాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఈసారి అధికారుల పరిశీలనలో ఎక్కువగా స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లే తిరస్కరణకు గురయ్యాయి. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రె స్ ప్రధాన పార్టీలతో పాటు ఇతర గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 16లక్షల 50వేల 175 మంది ఓటర్లు కాగా.. ఇందులో పురుషులు 804875, మహిళలు 845213, ఇతరులు 87 మంది ఓటర్లు ఉన్నారు. మే 13న నిర్వహించే ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అవసరమైన ఏర్పాట్లను చేపడుతున్నారు. సోమవారం నియోజక వర్గాల వారీగా మైక్రో అబ్జర్వర్స్ అధికారులను నియమించారు. ఆదిలాబాద్ 14 మంది, బోథ్ 30 మంది, ఆసిఫాబాద్ 24 మంది, సిర్పూర్ 16 మంది, నిర్మల్ 30, ఖానాపూర్ 49, ముథోల్ 27 మొత్తం 190 మంది మైక్రో అబ్జర్వర్స్‌ను కేటాయించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిపోవడంతో ఇక అభ్యర్థులు గెలిచేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్నారు. ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించిన అభ్యర్థులంతా మరింత స్పీడును పెంచుతున్నారు. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ సత్తా చాటేందుకు ప్రధాన పార్టీలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి.



పార్టీ అభ్యర్థులే ఫైనల్

ప్రధాన పార్టీలు ప్రకటించిన అభ్యర్థులే చివరకు ఎన్నికల బరిలో నిలిచారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలలో చివరి వరకు ప్రయత్నాలు చేసిన కొంత మంది నేతలకు అవకాశం దక్కలేదు. దీంతో రెబల్స్‌గా లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచేందుకు పలువురు నేతలు ప్రయత్నాలు చేశారు. ముఖ్యంగా బీజేపీ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుతో పాటు మరో సీనియర్ నేత మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ పోటీలో ఉంటామని ప్రకటించారు. అనుకున్నట్లుగానే రాథోడ్ రమేష్ నామినేషన్ కూడా దాఖలు చేశారు. కానీ అధికారుల పరిశీలనలో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. రాథోడ్ రమేష్ ఉద్దేశపూర్వకంగానే తప్పుడు నామినేషన్ వేశారన్న ప్రచారం జరుగుతోంది. రాథోడ్ రమేష్ పోటీ నుంచి తప్పుకోవడంతో బీజేపీకి రెబల్స్ గుబులు తప్పింది. సీనియర్ నేతలు పార్టీ అధిష్ఠానం బుజ్జగించడంతో సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు కూడా పూర్తిగా సైలెంట్ అయిపోయారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణతో పాటు ఆత్రం భాస్కర్ కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేసినా.. ఆయన నామినేషన్ కూడా తిరస్కరణకు గురైంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి దారావత్ నరేందర్ నామినేషన్ దాఖలు చేసినా.. పరిశీలనలో అధికారులు తిరస్కరించారు. ప్రధాన పార్టీలలో ఇద్దరు చొప్పున అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేసినా.. చివరకు పార్టీ నిర్ణయించిన అభ్యర్థులే ఎన్నికల బరిలో నిలిచారు. దీంతో అన్ని పార్టీలకు రెబల్స్ అభ్యర్థుల ప్రమాదం తప్పింది.

ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు వీరే..

1. ఆత్రం సుగుణ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సీ)
2. ఆత్రంసక్కు, భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)
3. గోడం నగేష్, బీజేపీ
4. మాలోతు శ్యామ్‌లాల్‌నాయక్, అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్ పార్టీ
5. రాథోడ్ సుభాష్, ఇండిపెండెంట్
6. మేస్రం గంగాదేవి , ధర్మ సమాజ్ పార్టీ
7. గేడంసాగర్, ఇండియా ప్రజాబంధు పార్టీ
8. కొడప వామన్‌రావు, గొండ్వానా దండకారణ్య పార్టీ
9. భుక్య జైవంత్‌రావు, స్వతంత్ర అభ్యర్థి
10. సునావత్ తిరుపతి, విద్యార్థుల రాజకీయ పార్టీ
11. చౌహన్ సుదర్శన్, అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ
12. జంగుబాపు మేస్రం, బహుజన్ సమాజ్ పార్టీ

సోయం మద్దతు ఎవరికి?

సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావును పార్టీ పక్కన పెట్టడంతో ఆయన గత కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో కనిపిస్తున్నారు. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎన్నికల బరిలో ఉంటానని ఆయనే స్వయంగా ప్రకటించిన అది సాధ్యం కాలేదు. రెబల్స్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు సోయం ఆసక్తిని చూపించలేదు. పార్టీ అధిష్ఠానం పెద్దల ఒత్తిళ్లు పెరగడంతోనే ఆయన వెనక్కి అడుగు వేసినట్లు తెలుస్తుంది. ఎన్నికల హడావుడి మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు సోయం పార్టీ కార్యక్రమాలు, అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేపట్టడం లేదు. దీంతో ఆయన మద్దతు ఎవరికన్నదే ప్రశ్నార్థకంగా మారింది. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులంతా ఆదివాసీలే కావడంతో ఆయన ఎవరికి మద్దతునిస్తారన్నదే రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముందు నుంచి బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ సోయంకు రాజకీయ శత్రువుగానే మారారు. గత లోక్‌సభ ఎన్నికల్లో గోడం నగేష్‌పై ఆయన ఘన విజయం సాధించారు. ఆదివాసీల ఉద్యమ సమయంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కుతో సోయంకు సత్సంబంధాలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ ఇద్దరు నేతలే ఆదివాసీ ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆత్రం సక్కు వైపే ఆయన ఎక్కువగా ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తుంది. పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వడం అనుమానమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సంక్షిప్త సమాచారం



గ్రామంలో 'భగీరథ' నీళ్లు వస్తున్న దృశ్యం

నీటి సమస్యకు పరిష్కారం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

భీంపూర్, ఏప్రిల్ 29: మండలంలోని భగవాన్‌పూర్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో ఎండాకాలంలో తాగునీటి కోసం స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే, ఈనెల 27న 'భగీరథ పైప్ లైన్ లీకేజీతో భగవాన్‌పూర్‌లో నీటి కష్టాలు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా మిషన్ భగీరథ ఏఈ మహేష్ సిబ్బందితో గ్రామానికి వెళ్లి పైప్‌లైన్ పనుల మరమ్మతులు పూర్తిచేశారు. దీంతో సోమవారం నుంచి గ్రామంలోని ప్రతీ ఇంటికి తాగునీరు రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రేపు జొన్నల కొనుగోలు బంద్

తాంసి, ఏప్రిల్ 29: తాంసి సహకార సొసైటీ పరిధిలో కొనుగోలు చేస్తున్న జొన్నల కేంద్రంలో మే 1న కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు సీఈవో కేశవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే డే సందర్భంగా ఈ చర్యలు తీసుకున్నామని వివరించారు. తిరిగి రెండో తేదీ నుంచి కొనుగోలు యధావిధిగా ఉంటాయని పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

సఖీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి : సరస్వతీ

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 29: ఆపదలో ఉన్న మహిళలు, యువతులు సఖీ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖీ సెంటర్ నిర్వాహకురాలు సరస్వతీ కోరారు. సఖీ కేంద్రం, మహిళా సాధికారత ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక మహిళలకు సఖీ కేంద్రం ద్వారా జరిగే సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖీ కేంద్రం మహిళల కోసం 24 గంటలు పని చేస్తుందని, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, గృహహింస, లైంగిక వేధింపులు, శారీరక వేధింపులు, బాలల అక్రమ రవాణా, ఎలాంటి ఆధారం లేని వయోవృద్ధులు, మహిళలు, బాలికలు ఉంటే మహిళా హెల్ప్‌లైన్ నెంబర్ 181కు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనిత, మహిళా సాధికారత జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ యశోద, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకురాలు సరస్వతీ

వందశాతం ఓటింగ్ అయ్యేలా చూడాలి

- ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాజేంద్ర విజయ్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మే13న జరిగే పోలింగ్‌లో వందశాతం ఓటింగ్ అయ్యేలా చూడాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాజేంద్రవిజయ్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని స్వీప్ కార్యాలయంలో భాగంగా డీఆర్డీఏ కార్యాలయంలో మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులు పాటల రూపంలో ఓటు హక్కు వినియోగంపై వివరించారు. అనంతరం డీఆర్డీఏ కార్యాలయం నుంచి చేపట్టిన ర్యాలీని అబ్జర్వర్ ప్రారంభించారు. అనంతరం ఎన్నికల్లో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమైందన్నారు. దేశంలో ఎన్నికలు కొనసాగుతున్నాయని, ప్రతిపౌరుడు బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. స్వీప్ యాక్టివిటీస్‌లో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషమైన విషయమన్నారు. అయితే మహిళ సంఘాలు ఇంటింటికి వెళ్లి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా, ఎండలు మండుతున్న నేపథ్యంలో పోలింగ్ రోజు ఉదయమే ఓటింగ్ వేసేలా చూడాలన్నారు. యంత్రాంగం కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వసతి కల్పించిందన్నారు. లైన్లు పెరగకుండా ఉదయమే అధిక శాతం పోలింగ్ అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వీప్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీవో సాయన్న, అర్బన్ తహసీల్దార్ సంపత్, డీసీపీవో నరేష్, మహిళ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్



ర్యాలీని ప్రారంభిస్తున్న రాజేంద్ర విజయ్

ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలి

- పంపిణీ ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్ లక్ష్మీ

తాంసి, ఏప్రిల్ 29: ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ లక్ష్మీ బీఎల్‌వోలకు సూచించారు. మండలంలోని హస్నాపూర్, పొన్నారి, తాంసి గ్రామాలలో కొనసాగుతున్న పంపిణీ ప్రక్రియను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మీ మాట్లాడుతూ వచ్చే నెల 5వ తేదీలోగా వంద శాతం పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఆమెతో పాటు జూనియర్ అసిస్టెంట్ దారవేణి రాఘవేంద్ర, తదితరులు ఉన్నారు.

ఉట్నూర్: ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేశ్ అన్నారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ఉట్నూర్ గ్రామ పంచాయతీ సిబ్బంది ఇమ్రాన్‌సాయి ఆధ్వర్యంలో సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని మోమిన్‌పురలో ఓటర్లకు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధరణి రాజేశ్ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ఓటర్‌కార్డు ఉన్న ప్రతి ఒక యువతీ, యువకులు పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కు బాధ్యాతాయుతంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సౌకత్‌ఆలీ, తదితరులు పాల్గొన్నారు.



పొన్నారిలో ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తున్న తహసీల్దార్



ఉట్నూర్‌లో ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం



పట్టుబడిన నగదు వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద రూ.77,600 నగదు స్వాధీనం

బోథ్, ఏప్రిల్ 29: మండలంలోని మహారాష్ట్ర సరిహద్దుల్లో గల ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో మహారాష్ట్ర నుంచి వస్తున్న వ్యక్తి వద్ద రూ.77,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు. మహారాష్ట్ర నుంచి నిర్మల్ వైపు వెళుతున్న మహారాష్ట్రకు చెందిన వ్యక్తి వద్ద ఈ నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. తనిఖీల్లో ఏఎస్ఐ గంగారెడ్డితో పాటు చెక్‌పోస్టు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఏజెన్సీ ప్రాంతాల్లో సాగు, తాగునీరు అందించాలి

- ప్రజా సంఘాల జేఏసీ నాయకుల డిమాండ్

ఉట్నూర్, ఏప్రిల్ 29: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో చాలా ఏళ్ల నుంచి పరిష్కారం కాని సాగునీరు, తాగునీరు సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి నేతావత్ రాందాస్, బానోత్ రామరావులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో సాగునీరు సమస్యలు పరిష్కరించడానికి భారీ ప్రాజెక్టులను, చిన్ననీటి ప్రాజెక్టులను నిర్మించి వాటి ద్వారా శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. తాగునీరు సమస్యను పరిష్కరించడానికి నీటిట్యాంకులను నిర్మించిన కూడా నీటి సరఫరా లేక నిరుపయోగంగా ఉన్నాయని, మంచినీటి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి సమస్యలను పరిష్కరించడానికి చిన్న వంతెనల నిర్మాణంతో పాటు రోడ్డు మరమ్మతులు చేయక పోవడంతో ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయన్నారు. విద్యా విధానం అభివృద్ధి చెందడానికి గిరిజన యూనివర్సిటీని మంజూరు చేయాలని, ఆదిలాబాద్ నుంచి ఏజెన్సీలోని ఉట్నూర్ మీదుగా రైల్వేలైన్ నిర్మాణంపై ఎంపీ అభ్యర్థులు ప్రకటన చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజనులు, గిరిజనేతరుల సమస్యలను పరిష్కరించాలన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాల పంపిణీ చేయాలన్నారు. ఇందులో ఆత్రం భీమ్‌రావ్, భానోత్‌రవీందర్, రాథోడ్ ప్రేమ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

'మే డేని ఘనంగా నిర్వహించాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 29: 138 మే డేని భారత కార్మిక వర్గం ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మేడే కరపత్రాలను సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ వెట్టి చాకిరికి అణచివేతకు పీడనకు వ్యతిరేకంగా 8గంటల పని దినం కోసం కార్మిక హక్కుల సాధన కోసం 1886లో మార్కెట్లో కార్మికులు చేసిన పోరాటంపై నాటి పాలక వర్గాలు దాడి చేసి అనేక మంది కార్మిక నాయకుల్ని బలి తీసుకున్నారన్నారు. ఆ త్యాగాల ద్వారానే అనేక దేశాల్లో ఎనిమిది గంటల పని దినం అమల్లోకి వచ్చిందని తెలిపారు. కానీ నేడున్న పాలక వర్గాలు ఆ హక్కులను, చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని, చట్టాలను కార్పొరేట్లకు యజమాన్యాలకు చుట్టాలుగా మార్చేశాయని ఆరోపించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌ల రూపంలో తీసుకువచ్చిందని, 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచి కార్మికులకు మళ్లీ వేతన బానిసలుగా మార్చే కుట్రలు పన్నుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెట్టి, విద్యా, వైద్య రంగాలను ధ్వంసం చేస్తూ వ్యాపారం చేసుకునే అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దుంపల రంజిత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పెర్క దేవిదాస్, ఎస్.నవీన్‌కుమార్, నాయకులు పండుగ పొచ్చన్న, సురేస్, శంకర్, రవి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు